## భక్తురాలికి తప్పిన పెను ప్రమాదంతో హడావిడిగా పాత మెట్ల మార్గం పనులను వేగవంతం చేసిన ఆలయ ఈఓ



విజయవాడ, మే 17 (నేటి శుభోదయ):- పాత మెట్ల మార్గంలో శుక్రవారం ఉదయం ఒక భక్తురాలిపై స్లాబ్ పెచ్చులు పడటంతో అమ్మవారి దయతో ఆ భక్తురాలికి తృటిలో పెను ప్రమాదం తప్పి స్వల్ప గాయాల పాలయ్యింది. ఈ ఘటనతో ఇంద్రకీలాద్రి పాత మెట్ల మార్గాన్ని ఆలయ ఈఓ శీనానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొండపై ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఈఈ-1 కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ అండ్ టీం లకు పాత మెట్ల మార్గం పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దుర్గమ్మ మెట్ల పూజ చేస్తూ కొండపైకి వెళ్లే పాత మెట్ల మార్గాన్ని ఈఓ శీనానాయక్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పాత మెట్ల మార్గం పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొండపై ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఈఈ-1 కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డీఈ అశోక్‌లకు పనుల నాణ్యతపై పలు సూచనలు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా మెట్ల మార్గంలో భక్తులకు అవసరమైన నీడ, తాగునీరు వంటి కనీస వసతులు కూడా పగడ్బందీగా కల్పించాలని సూచించారు.

## జనగణనలో ఖచ్చితత్వం, వేగం రెండూ అవసరం

: వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, మే 17 (నేటి శుభోదయ):- జనగణనలో ఖచ్చితత్వం, వేగం రెండూ అవసరం అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆదివారం ఉదయం నగరంలోని సీతారాంపురం, సత్యనారాయణపురం, దుర్గాపురం, మాచవరం, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి జరుగుతున్న జనగణన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జనగణన నిర్వహణలో పాల్గొంటున్న ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఆదివారం రోజు ఎక్కువ మంది ప్రజలు ఇళ్లలో అందుబాటులో ఉండే అవకాశం ఉన్నందున ఈ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని జనగణన సంఖ్యను గణనీయంగా పెంచాలని ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఆదేశించారు. ప్రతి ఇంటిని సందర్శించి పూర్తి వివరాలను సేకరించడంలో శ్రద్ధ వహించాలని, జనగణన ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే, వివిధ శాఖల అధిపతులు తమ పరిధిలోని సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు ప్రతిరోజూ కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేస్తున్నారా లేదా అన్నది నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ నిర్దేశించిన సంఖ్యలో జనగణన పూర్తి అయ్యేలా సమీక్షలు నిర్వహిస్తూ, అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. ప్రజల సహకారంతో జనగణన ప్రక్రియను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్లు డాక్టర్ డి. చంద్రశేఖర్, ఏ. రవీంద్రరావు, జోనల్ కమిషనర్లు కె. షమ్మీ, కె. ప్రభుదాస్, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక




విజయవాడ, మే 17 (నేటి శుభోదయ):- ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలలో తో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ఇంద్రకీలాద్రిపై భక్తులరద్దీ



విజయవాడ, మే 17 (నేటి శుభోదయ):- వేసవి సెలవులతో పాటు వివాహాల సీజన్, ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో తెల్లవారు జాము నుండే అన్ని దర్శనం క్యూ లైన్లు కిక్కిరిసాయి. భక్తుల రద్దీని గమనించి ఆలయ ఈవో వికె శీనా నాయక్ భద్రతా ఏర్పాట్లు, క్యూ లైన్లు పరిశీలన చేశారు. భక్తులందరికి శ్రీ దుర్గామల్లేశ్వరుల దర్శనం సులభతరంగా పూర్తి అవ్వాలనే ధ్యేయంతో అదనపు విధులు కేటాయించిన దేవాలయ సిబ్బంది క్యూ లైన్ల క్రమబద్ధీకరణ, రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఉదయం 10.30 నుండే 500/- దర్శనం టికెట్ల అమ్మకాలు నిలిపివేసారు. మధ్యాహ్నం1.30 నిమిషాలకు అంతరాలయ దర్శనం తిరిగి ప్రారంభించారు. ఈవో శీనానాయక్ వేగంగా అమ్మవారి దర్శనం అయ్యేలా భక్తుల రద్దీ క్రమబద్ధీకరణ చేశారు. ప్రధాన ఆలయం వెనుక భాగంలోని టికెట్ స్కానింగ్ పాయింట్ వద్ద చంటి బిడ్డల తల్లులు, వృద్ధులు, వికలాంగులకు టిక్కెట్ తో సంబంధం లేకుండా ప్రత్యేక దర్శనలైన్ ద్వారా దర్శనం ఏర్పాటు చేయడమైనది. పెరిగిన వేసవి ఎండలకు తగ్గట్టుగా భక్తులకు ఉపశమనం కలిగేలా దేవస్థానం ఆధ్వర్యంలో సేవకుల ద్వారా మంచి నీరు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసారు. భక్తులకు వేసవి ఎండల నుండి ఉపశమనం కల్పించేందుకు ప్రధాన ఆలయం చుట్టు ప్రక్కలా ఏర్పాటు చేసిన చలువ పందిళ్ళ క్రింద భక్తులు సేద దీరారు. కొండపైన, దిగువున చలివేంద్రాలు అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసారు. ప్రోటోకాల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు నుండి వచ్చిన దర్శనం విన్నపాలు పరిశీలన చేసి, క్రమబద్ధీకరణ చేసి, విపరీతంగా పెరిగిన భక్తులరద్దీ వలన ప్రోటోకాల్ దర్శనాలు రద్దు చేసామని, మధ్యాహ్నం 2 తర్వాత ఇంద్రకీలాద్రికి రావాలని, ఈవో రిఫరెన్స్ భక్తులకు నచ్చజెప్పారు. ఓం టర్నింగ్ నుండి ఘాట్ రోడ్ వైపు ఉన్న చెప్పులు స్థాండ్, క్లోక్ రూమ్, మొబైల్ భద్రపరచే కేంద్రాలను ఈవో పరిశీలించి భక్తులతో మాట్లాడారు. ఉచిత ప్రసాదం పంపిణీ, అన్న ప్రసాదం పంపిణీ పై సూచనలు ఇచ్చారు. మధ్యాహ్నం నైవేద్యం సమయములో శ్రీ అమ్మవారికి నైవేద్యం కొరకు అన్ని దర్శనం క్యూ లైన్లు ఆపడంతో భక్తులరద్దీ తీవ్రంగా పెరిగిందిజాతీయ రహదారి పై రద్దీ పెరగడంతో ఘాట్ రోడ్ వైపు వాహనాల రాకపోకలు నిలుపుదల చేసి, దేవస్థానం బస్సులు, బ్యాటరీ వాహనాల ద్వారా భక్తులను కొండపైకి చేర్చేల చర్యలు తీసుకున్నారు. సుమారు 40 వేల మందికి పైగా భక్తులు వచ్చారని అంచనా అని ఈఓ అన్నారు.

## ఉత్కంఠ భరితంగా సాగిన పోలీస్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్

**చీరాల సబ్ డివిజన్ జట్టుపై విజయం సాధించిన హెడ్ క్వార్టర్ టీమ్. అద్భుత బ్యాటింగ్ తో జట్టును విజయతీరాలకు చేర్చిన జిల్లా ఎస్పీబి. ఉమామహేశ్వర్ ఐపీఎస్**



బాపట్ల నేటి శుభోదయమే 17:గెలుపు ఓటములు అనేవి ముఖ్యం కాదు క్రీడా స్ఫూర్తే ప్రాధాన్యందపోలీస్ అధికారులు, సిబ్బంది పని ఒత్తిడిని అధిగమించేందుకే క్రికెట్ పోటీలు జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పని ఒత్తిడిని అధిగమించి మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ మైదానములో జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందితో క్రికెట్ టోర్నమెంట్ ఇటీవల ప్రారంభించడం జరిగింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో చీరాల సబ్ డివిజన్ జట్టుపై హెడ్ క్వార్టర్ జట్టు అద్భుత విజయం సాధించింది. ఎంతో ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్ లో జిల్లా ఎస్పీ గారి అద్భుతమైన బ్యాటింగ్ తో హెడ్ క్వార్టర్ టీం 20 ఓవర్లలో 180 పరుగులు చేసింది. జిల్లా ఎస్పీ గారు క్రీడాకారులకు కప్ ను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పై పని ఒత్తిడి అధికంగా ఉంటుందన్నారు. పని ఒత్తిడి నుండి బయటపడి మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని బాపట్ల జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పని ఒత్తిడి నుండి ఉపశమనం పొంది మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించేందుకు జిల్లా పోలీస్ క్రీడా మైదానంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ టోర్నమెంట్‌లో చీరాల, బాపట్ల, రేపల్లె సబ్ డివిజన్లకు చెందిన మూడు జట్లు, ఏఆర్ జట్టు అదేవిధంగా హెడ్ క్వార్టర్ జట్టు మొత్తం 5 జట్లు పాల్గొన్నాయన్నారు. ఈరోజు చీరాల సబ్ డివిజన్ జట్టు, హెడ్ క్వార్టర్ జట్టులకు మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ లో హెడ్ క్వార్టర్ జట్టు విజయం సాధించిందన్నారు. పూర్తిగా స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో గెలుపు, ఓటములను సమానమన్నారు. క్రీడల వలన నాయకత్వ లక్షణాలు పెరగడంతో పాటు సమిష్టి కృషి అలవడుతుందన్నారు. క్రీడలు ఆడడం, వీక్షించడం మంచి అలవాట్లు అయినప్పటికీ క్రీడలపై బెట్టింగ్‌లు నిర్వహించడం ప్రమాదకరమని



హెచ్చరించారు. బెట్టింగ్‌ల వలన అనేక మంది ఆర్థికంగా నష్టపోవడంతో పాటు తమ జీవితాలను అంధకారంలోకి నెట్టుకున్న ఉదాహరణలు ఉన్నాయన్నారు. ఇలాంటి పరిణామాలు చూస్తూనే కొంతమంది అత్యాశతో, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారన్నారు. యువత బెట్టింగ్ అనే మహమ్మారికి దూరంగా ఉండాలని, క్రికెట్‌ను కేవలం క్రీడా స్ఫూర్తితో మాత్రమే చూడాలన్నారు. దానిని జూదంగా మార్చి తమ అమూల్యమైన భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు సిసియస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, ఎస్‌బీ సీఐ జి. నారాయణ, ఎస్‌బీ--2 ఇన్స్పెక్టర్ ఎం. రాంబాబు, సీసీఎస్ ఇన్స్పెక్టర్ పి. ప్రేమయ్య, ఆర్.ఐలు మౌలుద్దీన్, ప్రదీప్, చీరాల 2 టౌన్ సీఐ శశి కుమార్, ఇతర పోలీస్ అధికారులు, చీరాల సబ్ డివిజన్, జిల్లా హెడ్ క్వార్టర్స్ జట్ల సభ్యులు పాల్గొన్నారు.

## అనంతపురంలో అట్టహాసంగా ముగిసిన రాష్ట్ర సేవికాసమితి ప్రవేశిక శిక్షణ కార్యక్రమం




అనంతపురం మే 17 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : రాష్ట్ర సేవికాసమితి ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ పరిధిలోని వివేకానంద జూనియర్ కాలేజ్ నందు నిర్వహించిన ప్రవేశిక శిక్షణ కార్యక్రమం అట్టహాసంగా ముగిసింది. మధు కుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ ముగింపు వేడుకలకు జెఎన్టియు ప్రొఫెసర్ డాక్టర్ పద్మ సువర్ణ, అఖిలభారత ఘోష్ ప్రచారక కిలంబి పంకజవల్లి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మే రెండవ తేదీ నుండి 17వ తేదీ వరకు జరిగిన ఈ 15 రోజుల శిక్షణా శిబిరంలో వందలాది మంది యువతులు పాల్గొని క్రమశిక్షణ, దేశభక్తి, శారీరిక యోగ, వివిధ రకాల అభ్యసనాలలో ప్రత్యేక శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్త కిలంబి పంకజవల్లి మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో స్త్రీల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను అడ్డుకోవడానికి మరియు అప్రమత్తంగా ఉండడానికి ప్రతి ఒక్క స్త్రీ జాగ్రత్తలు వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా స్త్రీలలో క్రమశిక్షణ, దేశం పట్ల గౌరవం, శారీరిక దృఢత్వం పట్ల అవగాహన పెంపొందించడం జరిగిందని తెలిపారు. కుటుంబ వ్యవస్థ ఎదుగుదలలో, పిల్లల పెంపకంలో స్త్రీ పాత్ర అత్యంత కీలకమైందని, మారుతున్న తరుణంలో మహిళలు తమ సంతానం పట్ల ఎంతో మెలకువగా ఉండాలని ఆమె సూచించారు. మరొక ముఖ్య అతిథి, జెఎన్టియు ప్రొఫెసర్ డాక్టర్ పద్మ సువర్ణ మాట్లాడుతూ, ప్రస్తుతం మొబైల్ ఫోన్ల ద్వారా పాశ్చాత్య సంస్కృతి పిల్లల్లోకి వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలియకుండానే పాశ్చాత్య దేశాల అలవాట్లు విద్యార్థులలో ప్రతిబింబిస్తున్నాయని, దీనిపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ మెలకువగా ఉండాలని, లేనిపక్షంలో పిల్లలు



చేజారిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం స్త్రీల ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని కాపాడేందుకు రాష్ట్ర సేవికాసమితి ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిక్షణ పొందిన వారు ఎంతో అదృష్టవంతులని, భవిష్యత్తులో ఈ సంస్థ ద్వారా మరికొన్ని లక్షల మంది మహిళలు లబ్ధి పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ముగింపు వేడుకల్లో భాగంగా శిక్షణ పొందిన యువతులు ప్రదర్శించిన దండ, యోగాసనాలు మరియు యోగ చాప్ ప్రదర్శనలు విచ్చేసిన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## రసవత్తరం గా జె.సి.ఎస్. వై ఎం.పి. ఎల్. క్రికెట్ టోర్నమెంట్ రెండవ రోజు




యాడికి మే 17 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: మండల కేంద్రమైన యాడికిలో తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి.అస్మిత్ రెడ్డి మరియు జెసి ప్రభాకర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ నందు రెండవ రోజు 6మ్యాచ్ లు జరిగాయి. మొదటగా వి లెవెన్స్ జట్టు , జెడ్పిహెచ్ఎస్ జట్టు తలపడగా మొదట బ్యాటింగ్ ఎంచుకున్న వి. లెవెన్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్ల లో 82 పరుగులు సాధించగా తరువాత బరిలోకి దిగిన జెడ్పిహెచ్ఎస్ జట్టు 9.3 ఓవర్లలో 85 పరుగులు చేసి విజయం సాధించింది . రెండవ మ్యాచ్ లో తుపాన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 141 పరుగులు సాధించగా 786 జట్టు 56 పరుగులు సాధించి ఓటమి చెందింది. మూడవ మ్యాచ్ లో పిన్నేపల్లి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 118 పరుగులు సాధించగా వీరారెడ్డి పల్లి 65 పరుగులు సాధించి ఓటమి చెందింది. నాలుగవ మ్యాచ్లో రామరాజు పల్లి 79పరుగులు సాధించగా కమలపాడు జట్టు 80 పరుగులు సాధించి విజయం సాధించింది. ఐదవ మ్యాచ్ లో మారుతీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 126 పరుగులు సాధించగా బాబురావు జట్టు నిర్నిత 10 ఓవర్లలో 102 పరుగులు సాధించి ఓటమి చెందింది . ఆరవ మ్యాచ్లో చిక్కేపల్లి జట్టు నిర్ణయిత ఓవర్లలో 106 పరుగులు చేయగా కుర్మాజీపేట జట్టు 95 పరుగులు చేసి ఓటమి చెందింది..టోర్నీ నిర్వాహకులు మాట్లాడుతూ తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి.అస్మిత్ రెడ్డి జన్మదిన సందర్భంగా మండల యువతలో ఉత్సాహం నింపడానికి ఈ టోర్నీ పెట్టడం జరిగిందని, మండల వ్యాప్తంగా దాదాపు 700 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, ఇందులో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి 30 వేల రూపాయలు టీడీపీ మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ , రెండవ బహుమతి 20వేల రూపాయలు సీనియర్ టిడిపి నాయకులు గొర్తి రుద్రమ నాయుడు, మూడో బహుమతి టి.డి.పి. టౌన్ ప్రెసిడెంట్ వెలిగండ్ల ఆదినారాయణ అందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. అలాగే క్రీడాకారులకు మ్యాన్ అఫ్ ది మ్యాచ్, సిరీస్, బెస్ట్ బాట్స్మన్, బౌలర్ ట్రోపీలను మరియు టోర్నమెంట్ నిర్వహణ ఖర్చులను విశ్వం విజన్ విద్యాసంస్థలవారు వారి యొక్క టీం అందిస్తున్నారని తెలపడం జరిగింది...అలాగే క్రీడాకారుల దాహార్తిని తీర్చుకోవడానికి , జనసేన పార్టీ యాడికి మండలం వారు కూల్ ప్యూరిఫైడ్ నీరు అందించడం జరిగింది అని తెలిపారు ...




## డిమాండ్ల సాధనకై మే 20 తేదీన మెడికల్ షాపులు బందు..!!



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తమ డిమాండ్ల సాధన కోసం మే 20 తేదీన కోరుకొండ మండలంలో మెడికల్ షాపులు బందు నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా డ్రగ్గిస్ట్ అసోసియేషన్ తెలిపింది. అసోసియేషన్ నాయకులు కటకం శ్రీనివాస్, కప్పల స్వామి, పెద్దింటి భార్గవ, నెక్కంటి మురళీకృష్ణ, బోనగిరి సతీష్ విలేకరులతో మాట్లాడుతూ.. మే 20 వ తేదీన కోరుకొండ మెడికల్ షాపులు బందు నిర్వహించడం జరుగుతుందని, కోరుకొండ మెయిన్ రోడ్లో హెల్త్ ఫార్మసీ మెడికల్ షాప్, శ్రీరంగపట్నంలో శివ మెడికల్ షాపులు మాత్రమే తెరచి ఉంటాయన్నారు. అత్యవసరం మందులు కావలసిన వారు ముందుగానే తమ వద్ద ఉంచుకోవాలని మెడికల్ షాపు యాజమాన్యం తెలిపారు. ఆన్లైన్ మందుల అమ్మకాలను నిషేధించాలని, అధికంగా డిస్కౌంట్లు ఇవ్వరాదని, నకిలీ మందులను అరికట్టాలని డిమాండ్లపై దేశవ్యాప్తంగా మందుల దుకాణాల బందు జరుగుతుందని వెల్లడించారు.

## టిజి ఎఫ్ సెట్ 2026 ఫలితాలలో కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం



ఖమ్మం, నేటి శుభోదయ ::: టిజి ఎఫ్ సెట్ -2026 ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్ , మాచవరపు కోటేశ్వర , యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంజనీరింగ్ , అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ఎ.శిశిర్ సాయి- 39, వి.ఎస్.ఎస్ లక్ష్మి-77, ఎస్ గిరీశ్వర్ రెడ్డి-213, జేఎల్ఎస్ మైత్రేయి- 330, ఈ. హర్షిత్- 364, ఏ మోక్షిత సాయి- 464,జె.చరణ్ తేజ్-549,ఎం.సాయి సత్విక-604, ఆర్. మేదిని-1165, జీ ప్రహర్ష- 1431, కె.భరత్ కుమార్-1508, పి కావేరి - 1547, ఎం.జస్వంత్ సాయి- 1560, ఎస్ డి సామ్యాసమర్-1595, పి హర్షవర్ధన్ -1631, పి జస్వంత్ కుమార్-1740, ఎం. వెంకటేశ్వర్లు- 1896 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ఏలూరి వంశీకృష్ణ, ఏవో నిరంజన్ కుమార్, అధ్యాపకులు , అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## టిజి ఎఫ్ సెట్- 2026 ఫలితాలలో రెజొనెన్స్ జయకేతనం



ఖమ్మం, నేటి శుభోదయ ::: తెలంగాణ ఎఫ్ సెట్ - 2026 ఇంజనీరింగ్ , అగ్రికల్చర్ ఫలితాలలో రెజొనెన్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఖమ్మం జిల్లాలోనే అగ్రగామిగా నిలిచారని కళాశాల డైరెక్టర్స్ ఆర్.వి. నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్రావు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో ఎల్. రామ్మోహన్ రెడ్డి 591, ఎండి. నిఖత్ పర్వీన్ 868, కె. సంతోష్ 1772, ఎం. హారిక 2387, ఎం. మోక్షిత 3349, ఎస్. లిఖిత 4286, జి. భరత్ చంద్ర 5470, ఎం. మన్వితా శ్రీ 5871, బి. సంయుత 6723 , అగ్రికల్చర్ విభాగంలో కె. సింధు 673, ఎం. పద్మ వచన్ 1979, కె.హారిక రెడ్డి 2121, విష్ణు 3295, కె. నవ్య 4971, శ్రీ లహరి 6987, సిహెచ్ . ధన్యత 9002, షేక్ రంషా రూహి 9136 వంటి ర్యాంకులు సాధించారని తెలిపారు. ఇంతటి ఘనవిజయం సాధించడానికి పటిష్టమైన ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, భోదనానుభవం కలిగిన మేనేజ్మెంట్ ఈ విజయానికి కారణమని, ఇంటర్ తో పాటే జేఈఈ, ఐఐటీ,నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు తగు శిక్షణనివ్వడం వలన ఇంతటి అద్భుత ఫలితాలు సాధించామని తెలిపారు. సాధారణ విద్యార్థులతో సైతం, అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ మూలంగానే ఇంతటి ఘన విజయం సాధించామని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సతీష్ , భాస్కర్రెడ్డి , అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

